క్లుప్తంగా

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా నోడల్ అధికారి

రుద్రవరం: గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి జగదీష్‌చంద్రారెడ్డి ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని యల్లావత్తుల గ్రామంలో శనివారం రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్వహించిన శివమోహన్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తామన్నారు. అలాగే కుష్ఠువ్యాధి, డయేరియా, ఫ్రైడే–డ్రైడే, వాటర్ టెస్టింగ్ వంటి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శాంతి, ఎంపీహెచ్‌ఏ కిరణ్, డేటాఎంట్రీ ఆపరేటర్ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

కరువు భత్యం ప్రకటించాలి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గోస్పాడు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు కరువు భత్యం ప్రకటించాలని గోస్పాడు మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కరువు భత్యం 25 శాతం ప్రకటించాలన్నారు. కేజీబీవీ పాఠశాలలకు ప్రత్యేక వార్డెన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. సీఆర్పీలకు, ఉన్నత పాఠశాలల్లో పని చేసే క్రాఫ్ట్, డ్రాయింగ్ కాంట్రాక్ట్ సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, సురేష్, సుబ్బరాయుడు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నిబంధనలకు విరుద్ధంగా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా కన్వీనర్ ఎంఆర్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం తరగతులు నిర్వహిస్తున్న కళాశాలల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవుల్లో కూడా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తుంటే ఇంటర్ విద్యా శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న కళాశాలలపై ఆర్ఐఓ చర్యలు తీసుకొని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రఫీ, హరి, విజయ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ కార్యక్రమాల విస్తృతమే లక్ష్యం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీఎస్ఐ నాయకులు

నంద్యాల(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలు కన్న ప్రభుద భారత్ కోసం బౌద్ధ కార్యక్రమాలను విస్తృతం చేయడమే లక్ష్యమని బీఎస్ఐ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లె ఓబయ్య తెలిపారు. స్థానిక నూనెపల్లె ఎస్ఆర్ నగర్‌లో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ సంస్కృతిలో విభిన్న ఆచారాలు ఉన్నాయని, పెద్ద చదువులు చదివినప్పటికీ సంస్కృతి, సంప్రదాయం విషయంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల యువతీ యువకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, దస్తగిరి, లాయర్ జీవన్, శ్రీనివాసులు, బాలకృష్ణ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సికింద్రాబాద్‌కు చెందిన పద్మావెంకటేష్, వారి బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. వినాయక పంచరత్నాలు, మహిషాసురమర్దిని, శివ తాండవం, శంభో శివశంభో, అయిగిరినందిని, శివశివశంకరా తదితర గీతాలకు లాస్య, లిక్షిత, సునంద, గాయత్రీఅరుణ్ నృత్య ప్రదర్శనతో అలరించారు.



కాలువ కింద జలమయమైన పంట పొలాలు, (ఇన్‌సెట్‌లో) నీటమునిగిన వరిపైరును చూపిస్తున్న రైతు,



చింతలచెరువు ఎస్సీ కాలనీలోకి ప్రవహిస్తున్న నీరు

ముంచెత్తిన తెలుగుగంగ

- కాలువ సామర్థ్యానికి మించి నీరు విడుదల
- జలమయమైన వరి, మొక్కజొన్న, ఉల్లి పంటలు
- చింతలచెరువు గ్రామంలోకి చేరిన నీరు

చాగలమర్రి: తెలుగుగంగ ప్రధాన కాలువ తీర గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. కొన్ని చోట్ల ఏకంగా ఊర్లలోకి నీళ్లొచ్చాయి. మండలంలోని డి.వనిపెంట, డి.కొత్తపల్లె, చింతలచెరువు, పెద్దవంగలి గ్రామాల గుండా తెలుగుగంగ కాలువ పారుతుంది. ఆయకట్టు పంటల కోసం ఇటీవల వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 5వేల క్యూసెక్కులకు పైగా నీరు కాలువకు వదిలారు. కాలువ సామర్థ్యానికి మించి నీరు వదలడంతో దొర్నిపాడు మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, ఉల్లి, మినుము తదితర పంటలు 50 ఎకరాల వరకు నీట మునిగాయి. రెండు, మూడడుగుల మేర నీరు చేరడంతో పైర్లు కనిపించని పరిస్థితి. ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడి పెట్టామని, అదంతా ఇప్పుడు నీటి పాలైందని చింతలచెరువు గ్రామ రైతులు గుద్దేటి ప్రతాప్‌రెడ్డి, వడ్ల రమణాచారి, విశ్వనాథరెడ్డి, పసరం ఓబులరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి వాపోతున్నారు. ఇదిలా ఉంటే కాలువ నీరు ఉప్పొంగి చింతల చెరువు గ్రామ ప్రధాన రహదారి గుండా ఎస్సీ కాలనీలోకి ప్రవహిస్తుండటంతో పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల నుంచి చాగలమర్రికి వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న తెలుగుగంగ పంట కాలువ

వక్ఫ్ సవరణ బిల్లుపై వైఎస్సార్‌సీపీ నిర్ణయం హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం ఫెడరేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడం హర్షణీయమని ముస్లిం ఫెడరేషన్ నాయకులు మహబూబ్‌బాషా, సుహేల్‌రాణా, జుబేర్ పూనా అన్నారు. శనివారం వారు నంద్యాలలో విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాల కాలం నాటి వక్ఫ్ చట్టాన్ని భగ్నం చేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. బీజేపీ ముస్లింలకు చేస్తున్న అన్యాయాన్ని టీడీపీ, జనసేన వంత పలకడం విచారకరమన్నారు. ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లా ఖాజాహుసేన్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలను నమ్మి ఓట్లు వేసిన ముస్లింల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలబడకపోగా వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చి వెన్నుపోటు పొడిచేందుకు యత్నించారన్నారు. కూటమిలోని ముస్లిం నాయకులు ఈ విషయాన్ని గ్రహించి,వారి చర్యలను ఖండించాలన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవిరాజ్

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు గాలి రవిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. మూడునెలలు అవుతున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు లేవన్నారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆడబిడ్డ పథకం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలు అమలు చేయడంలో కూటమి సర్కారు ఘోరంగా విఫలమైందని అన్నారు. ఖజాన ఖాళీగా ఉందని సాకులు చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా మేనిఫెస్టోలో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న

నంద్యాల(న్యూటౌన్): ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ నంద్యాల పట్టణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మికులకు వడ్డీ లేకుండా రుణ సదుపాయం కల్పించాలన్నారు. జీఓ నం.21, 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా భూమిని శ్రీనివాసులు, గౌరవ సలహాదారుగా లక్ష్మీనారాయణగౌడ్, అధ్యక్ష కార్యదర్శులుగా ప్రసాద్, చిరంజీవి, ఉపాధ్యక్షులుగా సిద్ధిక్, బాలవెంకటేశ్వర్‌ను, సహాయ కార్యదర్శులుగా గణపతి, సుబ్బరాయుడు, కోశాధికారిగా శ్రీనివాసులతో పాటు 21 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సోమన్న, ప్రభాకర్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో సామూహిక వ్రతం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నూనెపల్లె శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నూనెపల్లె ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం ఏడు శనివారాల వెంకటేశ్వర స్వామి సామూహిక వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండలి అధ్యక్షురాలు అయ్యపుశెట్టి కళావతి, జక్కా రాజేశ్వరి మాట్లాడుతూ ఆగస్టు 10వ తేదీ నుంచి నవంబర్ 2వ తేదీ వరకు వ్రతం నిర్వహించి అదే రోజు స్వామి వారి కల్యాణ కార్యక్రమం జరుపుతామన్నారు. కార్యక్రమంలో జ్యేష్ఠ, పుష్పలత, సంధ్యా, అరుణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయస్వామి, లక్ష్మీవెంకటేశ్వరస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విన్నపం

వడ్డెర కార్పొరేషన్‌కు రూ.200 కోట్లు కేటాయించాలి

నంద్యాల(అర్బన్): వడ్డెర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టం చేయాలని కార్పొరేషన్‌కు రూ.200 కోట్లు కేటాయించాలని అఖిల భారత వడ్డెర సామాజిక సంఘం కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు కోరారు. వడ్డెరుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటూ శనివారం రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా రాష్ట్ర కార్పొరేషన్ ద్వారా డైరెక్ట్‌గా అర్హులైన వారికి బ్యాంకు రుణాలు వచ్చేలా చూడాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డె గోపాల్, మంజుల సుబ్బరాయుడు, జనార్దన్, నాగేంద్ర, శివభాస్కర్, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

12 నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

దొర్నిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12 నుంచి 14వరకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు గ్రామాభివృద్ధిపై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, అధికారాలు వంటిని వివరిస్తారన్నారు. పారిశుద్ధ్యం, చెత్తసంపద కేంద్రాల నిర్వహణ, 2024–2025 గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తప్పని సరిగా విధులకు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎస్ఓ శ్రీనివాసులుకు పదోన్నతి

చాగలమర్రి: రుద్రవరం రెంజ్ పరిధిలోని చాగలమర్రి మండలం డి.వనిపెంట సెక్షన్ అటవీ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు నాయుడుకు కడప డివిజన్ ముద్దనూరు రెంజ్ డిప్యూటీ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు సర్కిల్ అటవీశాఖ కన్జర్వేటర్ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో నర్సాపురం సెక్షన్ ఆఫీసర్ ముర్తుజాకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

17న ఎస్ఎంసీ ఎన్నికలు

శిరివెళ్ల: మండలంలో వాయిదా పడ్డ రెండు పాఠశాలల స్కూల్ మేనేజ్ కమిటీ ఎన్నికలు ఈ నెల 17వ తేదీన జరగనున్నాయని ఏంఈఓ శంకర ప్రసాదు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీన కోరం లేక స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, వనికినిదిన్నె ప్రాథమికోన్నత పాఠశాల కమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. రెండోసారి వాయిదా పడకుండా తల్లి దండ్రులందరూ ఎన్నికలకు హాజరుకావాలని కోరారు.

53 జీవో ప్రకారం పని సర్దుబాటు చేయాలి

నంద్యాల(అర్బన్): ఉపాధ్యాయులకు 53 జీవో ప్రకారం పని సర్దుబాటు చేయాలని పీఆర్‌టీయూ నంద్యాల మండల అధ్యక్షుడు దస్తగిరి కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతుల తర్వాత పని సర్దుబాటు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న హెచ్ఎంలు, పాఠశాల సహాయకుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరెడ్డి, జగదీష్, కలాం, మాధవరెడ్డి, శ్రీనివాసులు, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక..

స్వామి సేవకు నోచుకోక

- మంటపాలను పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు
- శిథిలావస్థకు చేరుతున్న వైనం



చాకరాజువేముల గ్రామంలోని చెన్నకేశవ ఆలయం ఎదుట శిథిలావస్థలో నాలుగుకాళ్ల మంటపం



క్రిష్టిపాడులోని చెన్నకేశవస్వామి ఆలయం ఎదుట మంటపంలో దెబ్బతిన్న ధ్వజస్తంభం

దొర్నిపాడు: క్రిష్టిపాడు గ్రామంలోని చెన్నకేశవస్వామి,శ్రీనాగేశ్వరస్వామి, చాకరాజువేముల గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ, శ్రీగౌరీభోగేశ్వరస్వామి ఆలయాల ముందు పూర్వం పెద్దలు మంటపాలను నిర్మించారు. ఉత్సవ మూర్తుల కల్యాణోత్సవాలు, పండుగల సమయంలో గ్రామోత్సాల అనంతరం మంటపాల్లో కాసేపు సేదతీర్చేవారు. ప్రస్తుతం ఆయా ఆలయాలకు రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా దేవదాయ శాఖ పట్టించుకోవడం లేదు. చాకరాజువేముల గ్రామంలోని శ్రీలక్ష్మిచెన్నకేశవ, శ్రీగౌరీభోగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించి 90.14 ఎరాల మాన్యం భూమి ఉంది. ఈ ఏడాది కౌలు కింద ఆలయానికి రూ.20.14లక్షల ఆదాయం వచ్చింది. అలాగే క్రిష్టిపాడులో శ్రీచెన్నకేశవస్వామి, శ్రీనాగేశ్వరస్వామి ఆలయాలకు 52.04ఎకరాలు మాన్యం ఉండగా రైతులు రూ.11.73లక్షలు ఆదాయం వచ్చింది.

శిథిలావస్థలో మంటపాలు

రెండు గ్రామాల్లోని ఆలయాల ముందున్న మంటపాలు శిథిలావస్థలో ఉన్నాయి. చాకరాజువేముల గ్రామంలోని మంటపం పైభాగం కూలేందుకు సిద్ధంగా ఉంది. వేసవి కాలంలో స్థానికులు కాసేపు మంటపం కింద సేదతీరుతారు కూడా. ప్రస్తుతం స్వామివార్ల సేవకు వాటిని ఉపయోగించక పోయినా అలనాటి కట్టడాలు శిథిలం కాకుండా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. అలాగే క్రిష్టిపాడులోని మంటపం ఇటీవలే మెత్తభాగం మరమ్మతులు చేసినప్పటికీ లోన ఉన్న ధ్వజస్తంభం పూర్తిగా పాడైంది. రెండు వంటపాలు పునాదులు, నాలుగు స్తంభాలు చెక్కుచెదరక పోయినా మెత్తుభాగాలు దెబ్బతిన్నాయి. పురాతన కట్టడాలు మరుగున పడకుండా బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఈ విషయాన్ని ఈఓ చంద్రుడు దృష్టికి తీసుకెళ్లగా ఆలయాలతో పాటు మంటపాలకు మైనర్ మరమ్మతులు ఉన్నాయని వాటిని బాగుచేసేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని తెలిపారు.

ఈ గండిని పూడ్చేదెప్పుడో!

- పదిరోజులైనా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో రైతన్నలు



అప్పనపల్లె వద్ద 19వ బ్లాకు మైనర్ కాల్వకు పడిన గండి

రుద్రవరం: మండల పరిధిలోని అప్పనపల్లె వద్ద 19 బ్లాకు ఉప ప్రధానకాల్వ నుంచి వెళ్లే మైనర్ కాల్వకు పది రోజుల కింద గండిపడింది. నేటి వరకు తెలుగు గంగ అధికారులు గండిని పూడ్చక పోవడంతో దిగువ భాగాన ఉన్న ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి తెలుగుగంగ కాల్వలకు ఈనెల 1న 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో కాల్వలు నీటి ప్రవాహ ఉధృతికి తాళలేక 17 బ్లాకు కాల్వకు శ్రీరంగాపురం వద్ద, 19 బ్లాకు కాల్వకు అప్పనపల్లె వద్ద గండ్లుపడ్డాయి. దీంతో నీరు ఎగువ ఆయకట్టు పొలాలకు పారక వృథాగా పోతుండటంతో ఆ మైనర్ కాల్వలకు నీటి సరఫరా నిలిపివేశారు. పదిరోజులైనా మరమ్మతులు చేయకపోవడంతో ఆరెండు కాల్వల పరిధిలోని రైతులు అందోళన చెందుతున్నారు. ప్రధానంగా అప్పనపల్లె కాల్వ కింద ఆగ్రామంతో పాటు కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాలకు చెందిన రైతులు వందలాది ఎకరాల్లో మినుము, మొక్కజొన్న, మిర్చి, పత్తి వంటి పంటలు సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురువక పోవడంతో పంటలు వాడుముఖం పట్టాయి. 19వ బ్లాకు మైనర్ కాల్వ నుంచి నీరు వస్తే వాడుతున్న పంటలకు తడులు పారించుకోవాలని ఆశతో ఉన్నారు. అధికారులు వెంటనే గండిని పూడ్చి కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



క్రిష్టిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

దొర్నిపాడు: వరద నీటి ప్రవాహంతో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉదయం క్రిష్టిపాడు వద్ద ఉన్న బ్రిడ్జికి రెండు అడుగుల కింద పారిన కుందూ సాయంత్రానికి వంతెనను తాకింది. దీంతో నది పరివాహక ప్రాంతంలో వరినాట్లకు వెళ్లిన దొర్నిపాడు, క్రిష్టిపాడు, చాకరాజువేముల, కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామాలకు చెందిన కూలీలు తిరిగి ఇళ్లకు చేరుకునేందుకు అవస్థలు పడ్డారు. ఒకరినొకరు చేతులు పట్టుకోని అతికష్టం మీద ఒడ్డుకు చేరారు. గంట గంటకు నీటిమట్టం పెరుగుతుందని తెల్లారేసరికి బ్రిడ్జి పూర్తిగా మునిగి పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కుందూనదిపై నిర్మించిన వంతెనపై రైతులు, కూలీలు వెళ్లరాదని గ్రామ రెవెన్యూ అధికారి సాంబశివుడు పేర్కొన్నారు.

పెళ్లి వేడుకలో రక్తదాన శిబిరం

- దాతలుగా బంధుమిత్రులు



కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న వధూవరులు

ఆళ్లగడ్డ: సాధారణంగా పెళ్లి వేడుకలు అంటే బంధుమిత్రుల సందడి.. విందు, చిందు కార్యక్రమాలుంటాయి. అయితే, ఓ జంట ఇందుకు భిన్నంగా ఆలోచించి ఆదర్శమయ్యారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆళ్లగడ్డ మండలం నందింపల్లె గ్రామానికి చెందిన తలారి మహేంద్ర శనివారం సాయిలక్ష్మీదేవి అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ సందర్భంగా వారు ఏదైనా మంచి పని చేయాలని నిర్ణయించుకుని పెళ్లి తంతు ముగిసిన వెంటనే కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వధూవరులతో పాటు పెళ్లికి హాజరైన బంధుమిత్రులు 20 మంది రక్తదానం చేశారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమం నిర్వహించారని స్థానికులు నూతన దంపతులను అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి పచ్చ మూకల పనే

- బాధ్యులను కఠినంగా శిక్షించాలి
- దాడిని నిరసిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ వాదుల కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ప్రజాస్వామ్య వాదులు

నంద్యాల(అర్బన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక మహా శిల్పంపై దాడి పచ్చమూకల పనే అని ప్రజాస్వామ్య పరిరక్షణ వాదులు మండిపడ్డారు. ఈ దాడిని నిరసిస్తూ వారు శనివారం రాత్రి బొగ్గులైన్ ప్రాంతం నుంచి బొమ్మలసత్రం వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య వాదులు కారు రవికుమార్, మనోజ్ కుమార్ మాట్లాడుతూ విజయవాడలో గత రాత్రి భారత రాజ్యాంగ నిర్మాత మహా శిల్పం కూల్చివేతకు టీడీపీ శ్రేణులు కుట్ర పన్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.404 కోట్ల వ్యయంతో దేశంలోనే అతిపెద్ద మహాశిల్పాన్ని ఆవిష్కరించారన్నారు. అలాంటి గొప్ప విగ్రహాన్ని ధ్వంసం చేయాలనుకోవడం క్షమించరాని తప్పు అన్నారు. బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే దాడిని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలన్నారు. ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును రాజకీయాలకు అతీతంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మోహన్, ఇమ్మానియేల్, ఎర్రన్న, ప్రసాద్, శీను, తిమ్మరాజు, మీసాల రవి, కిరణ్, నరసింహులు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.